సాక్షి కృష్ణాజిల్లా

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



ఘనంగా గ్యార్మీ వేడుకలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీ పురం గాలిబ్ షరీఫ్ దర్గాలో గ్యార్మీ వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి పాల్గొన్నారు.



'పవర్‌లిఫ్టింగ్' జట్ల ఎంపిక

జగ్గయ్యపేటఅర్బన్: ఉమ్మడి కృష్ణా అండర్ -17 బాలబాలికల పవర్ లిఫ్టింగ్ ఎంపికలు జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగాయి. ▶10లో



బాస్కెట్‌బాల్ విజేతగా కృష్ణా

పెనుమంత్ర: పశ్చిమగోదావరి జిల్లా మార్టే రులో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీలల విజేతగా 'కృష్ణా' నిలిచింది.

విద్యుత్ సేవలు మెరుగు

- మచిలీపట్నం కేంద్రంగా విద్యుత్ సర్కిల్ ఏర్పాటు ప్రక్రియ పూర్తి
- సేవల మెరుగుకు విజయవాడ నుంచి విభజన
- నాడు కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఆ మేరకు జిల్లాకో సర్కిల్ ఏర్పాటు చేసేలా చర్యలు
- 6.40 లక్షల మందికి అందనున్న సేవలు

కృష్ణా కొత్త సర్కిల్ ఆవిర్భావం



సాక్షి, మచిలీపట్నం: వినియోగదారులకు మెరుగైన విద్యుత సేవలు అందునున్నాయి. కృష్ణా కొత్త సర్కిల్ ఏర్పాటుతో సేవలు మరింత చేరువకానున్నాయ. మచిలీపట్నం కేంద్రంగా కృష్ణా కొత్త సర్కిల్‌ను ఏర్పాటు చేస్తూ సంస్థ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు ప్రక్రియను పూర్తి చేశారు. మొన్నటి వరకు ఉమ్మడి జిల్లాకు సర్కిల్ విజయవాడ కేంద్రంగా ఉండగా ఆపరేషన్స్ ఎస్‌ఈ (జిల్లా స్థాయి అధికారి) అక్కడే ఉండేవారు. సర్కిల్ ఏర్పాటుతో మచిలీపట్నానికి ఎస్‌ఈ అధికారిని నియమించారు. దీంతో విద్యుత్ వినియోగదారుడికి మెరుగైన సేవలు చేరువ కానున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి పాలనను చేరువ చేసింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంస్కరణలు తెచ్చి, ప్రతి పార్లమెంట్ నియోజక వర్గాన్ని ఒక జిల్లాగా మార్చారు. దీంతో రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాలు ఇప్పుడు 26 అయ్యాయి. అప్పట్లోనే కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రధాన పరిపాలన శాఖలు రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖలు జిల్లాల వారీగా విభజించారు. కొన్ని సాంకేతిక కారణాలతో విద్యుత్ పంపిణీ సంస్థలోని సర్కిళ్లను విభజించ లేదు. ఇప్పుడు అడ్డంకులు తొలగిపోవడంతో కొత్త సర్కిల్‌ను ఏర్పాటు చేశారు.

విభజన ఇలా..

ప్రస్తుతం ఉమ్మడిగా ఉన్న సర్కిల్‌లోని గుణదల డివిజన్‌లో ఉన్న కృష్ణా జిల్లాలోని కానూరు సబ్ డివిజన్, కానూరు, కంకిపాడు, పెనమలూరు, పోరంకి, యనమలకుదురు సెక్షన్ (ఏఈ స్థాయి అధికారి ఉండే పరిధి)లను ఎన్టీఆర్ జిల్లా నుంచి తొలగించి 'కృష్ణా'లో కలిపారు. కృష్ణా జిల్లా గుడివాడ డివిజన్‌లో ఉన్న కై కలూరు సబ్‌డివిజన్‌తో పాటు కై కలూరు టౌన్, రూరల్, కలిదిండి, మండవల్లి, నూజివీడు డివిజన్‌లోని నూజివీడు సబ్ డివిజన్, నూజివీడు టౌన్, రూరల్స్, అడవినెక్కలం, ఆగిరిపల్లి, ముసునూరు, రామనక్కపేట, మీర్జాపురం, చాట్రాయి సెక్షన్లను ఏలూరు జిల్లాలో విలీనం చేశారు.

వినియోగదారుల సమాచారం ఇది

ఉమ్మడి కృష్ణా జిల్లా లో మొత్తం 18.99 లక్షల కనెక్షన్లు ఉండగా ఎల్టీ గృహ కనెక్షన్లు 15.26లక్షలు, వ్యాపార 1.94లక్షలు, చిన్న, మధ్య పరిశ్రమలు 6,962, వ్యవసాయ ఉచిత విద్యుత్ కనెక్షన్లు 1.25లక్షలు, ఆక్వా 17,444 కనెక్షన్లు ఉన్నాయి. సుమారు 37.58 కోట్ల యూనిట్ల విద్యుత్ సరఫరా అవుతుంది. కొత్తగా 6.40 లక్షల మంది వినియోగదారులున్నారు.

ఇక అందుబాటులో అధికారులు

మచిలీపట్నం కేంద్రంగా సర్కిల్ ఏర్పడడంతో సేవలు మెరుగుపడనున్నాయి. వినియోగదారుల సమస్యలు, కొన్ని దరఖాస్తులకు అనుమతులు ఎస్‌ఈ పరిధిలో ఉంటాయి. ఇది వరకు ఎస్‌ఈ విజయవాడలో ఉండేవారు. పని ఉన్న ప్రతిసారి అక్కడకు వెళ్లాల్సి వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. సర్కిల్ ఏర్పడటంతో ఆపరేషన్స్ ఎస్‌ఈతో పాటు టెక్నికల్, కమర్షియల్ విభాగాలు, ట్రాన్స్‌ఫార్మర్స్, కన్‌స్ట్రక్షన్స్, మీటర్స్ అండ్ ప్రొటెక్షన్ విభాగాల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో పాటు విద్యుత్ చౌర్య నివారణ విభాగం ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి.

ఆపరేషన్స్ ఎస్‌ఈగా సత్యానందం



సర్కిల్ ఆపరేషన్స్ ఎస్‌ఈగా సత్యానందాన్ని నియమించారు. కృష్ణా జిల్లాకు మచిలీపట్నంలో సర్కిల్ ఏర్పాటు చేయడంతో విజయవాడలో ప్రధాన కార్యాలయంలో స్కాడా ఎస్‌ఈగా పనిచేసిన ఎం.సత్యానందంను ఇక్కడ ఆపరేషన్స్ ఎస్‌ఈగా నియమించారు.

న్యూస్‌రీల్

సౌత్ ఇండియా బాస్కెట్‌బాల్ పోటీలకు 'ఏఎన్నార్' విద్యార్థులు



గుడివాడ టౌన్: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభను ప్రదర్శించి తమ కళాశాల క్రీడాకారులు సౌత్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. సోమవారం పోటీలకు ఎంపికైన క్రీడాకారులు బి. దేవదానం, ఎన్. వర్ధన్‌ను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నూజివీడు ధర్మ అప్పారావు కళాశాలలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు కృష్ణా యూనివర్సిటీ తరఫున ఆడి విజయం సాధించారన్నారు. జట్టుకు వీరిద్దరూ ఎంపిక కావడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, పీడీ వీర్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ డివిజన్‌లో 'విజిలెన్స్' వారోత్సవాలు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో ఈ నెల 28 నుంచి నవంబర్ 3 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం డీఆర్ఎం కార్యాలయంలో పలు బ్రాంచ్ అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైల్వే స్టేషన్ వరకు విజిలెన్స్ అవగాహనపై ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. డీఆర్ఎం మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే ఉద్యోగులు విధుల్లో పారదర్శకత, నిజాయతీ, జవాబుదారీతనం వంటి అత్యున్నత ప్రమాణాలను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్, పలువురు అధికారులు, ఉద్యోగులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, జాక్ అండ్ జిల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమ్మ అలంకరణకు రూ.1.30 లక్షల గాజులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు వచ్చే నెల 3వ తేదీన జరగనున్న విశేష అలంకరణకు అవసరమైన గాజులను విరాళాలుగా అందజేస్తున్నారు. విజయవాడకు చెందిన పలువురు భక్తులు సోమవారం రూ.1.30 లక్షల విలువైన గాజులను విరాళంగా ఇచ్చారు.
దుర్గమ్మకు రాజమండ్రి పీఅండ్‌టీ కాలనీకి చెందిన కేశవ శ్రీనివాసరెడ్డి కుటుంబం రూ. 1.30 లక్షలు.. 18 గ్రాముల బంగారంతో చేసిన బంగారుహారాన్ని బహూకరించారు.

విజయానికి చేరువలో ఆంధ్రా జట్టు



విజయవాడస్పోర్ట్స్: మూలపాడు ఏసీఏ మైదానంలో జరుగుతున్న కల్నల్ సి.కె. నాయుడు ట్రోఫీ ఆంధ్రా- విదర్భ మ్యాచ్ ముగింపు దశకు చేరుకుంది. రెండో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి సెకండ్ ఇన్నింగ్స్‌లో ఆంధ్రా జట్టు 63 పరుగులు చేయాల్సి ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 212 రన్స్ చేయగా ఆంధ్రా 170 రన్స్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో విదర్భ 98 రన్స్‌కే ఆలౌటైంది. అప్పటికే ఆంధ్రా విజయానికి 141 పరుగులు చేయాల్సి ఉంది. సోమవారం సాయంత్రం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 31 ఓవర్లకు మూడు వికెట్లు నష్టపోయి 78 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్‌లు రవితేజ 35, సుబ్రహ్మణ్యం 22 పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు. మరో 63 పరుగులు చేస్తే ఆంధ్రా జట్టు విజయం సాధిస్తుంది. రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్రా బౌలర్ శ్రీకర్ విదర్భ బ్యాట్స్‌మెన్‌లను కట్టడి చేసి మూడు కీలకమైన వికెట్లు తీశాడు.

నాణ్యమైన శాశ్వత పరిష్కారం చూపండి

- మీకోసంలో 128 అర్జీలు స్వీకరణ
- జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ గీతాంజలిశర్మ, ఇతర అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): అర్జీదారులకు నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాల్లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీతో పాటు డీఆర్వో చంద్రశేఖరావు, కేఆర్‌సీ ఎస్‌డీసీ శ్రీదేవి, ఆర్డీవో స్వాతి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం జేసీ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యమిచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం 108 అర్జీలు వచ్చాయని అవి నిర్ణీత గడువులోనే ఉన్నాయన్నారు. మీకోసంలో 811 అర్జీలు వచ్చాయని అందులో 51 శాతం రెవెన్యూకు చెందినవి, మిగిలినవి పోలీస్, జల వనరులు తదితర శాఖలకు చెందినవి ఉన్నాయన్నారు. ఈ నెల 28 నుంచి నవంబరు 3వ తేదీ వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తామని, అవినీతిని అరికట్టడానికి కృషి చేయాలని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్వో మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు, చాపలు లేవనే విషయం తమ దృష్టికి రావడంతో అధికారులు ఆర్థిక సాయం అందిస్తే వారికి వచ్చే వారంలోగా ఏర్పాటు చేస్తామని చెప్పడంతో వారందరూ అంగీకరించారు. మీ కోసం కార్యక్రమంలో 128 అర్జీలను స్వీకరించారు. గ్రామంలో మల్లంపల్లి వెళ్లే మార్గంలో పాత సంత బజారులో పోతార్లంక సుబ్బమ్మ అనే మహిళ తన నివాసాన్ని మద్యం షాపుగా ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నారని సమీపంలో రామాలయం, కమ్యూనిటీ హాలు, అంబేడ్కర్ విగ్రహం, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని 300 మంది చేనేత కుటుంబాలు వృత్తి చేసుకుని జీవిస్తుంటారన్నారు. ఈ ప్రాంతంలో మద్యంషాపు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఎదుర్కొంటామని ఘంటసాల మహిళలు జేసీకి అర్జీ ఇచ్చారు.

- గుడివాడ, బంటుమిల్లి ప్రాంతాలకు వెళ్లే బస్సుల విషయం, గుడివాడలో అసౌకర్యాలపై రాష్ట్ర రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు అర్జీ ఇచ్చారు.

ఆయుధాల వినియోగం అర్థమైందా!

ఓపెన్‌హౌస్‌లో విద్యార్థులతో ఎస్పీ గంగాధర్



ఓపెన్‌హౌస్‌లో ఆయుధాల వినియోగాన్ని విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ గంగాధర్‌రావు

కోనేరుసెంటర్: బాబూ ఆయుధాలు బాగున్నాయా... తల్లీ ఆయుధాల వినియోగం అర్థమైందా... ఆపద సమయంలో పోలీసులు ఎలా స్పందిస్తారో తెలిసిందా...ఎలాంటి సమయంలో పోలీసులు వాటిని ఉపయోగిస్తారో అవగతమైందా అంటూ కృష్ణా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులతో ఓపెన్‌హౌస్‌లో ముచ్చటించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన ఓపెన్‌హౌస్‌లో ఎస్పీ పాల్గొన్నారు. ఎస్పీ ఆయుధాలను ఉపయోగించటంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. విద్యార్థులకు కలిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. పోలీస్ డాగ్ విన్యాసాలను ప్రదర్శించడంతో ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్, సీఐలు, ఎస్సైలు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించండి

డీఎస్‌వో పార్వతి



మాట్లాడుతున్న డీఎస్‌వో పార్వతి

చిలకలపూడి(మచిలీపట్నం): రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సేకరించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వి.పార్వతి అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ధాన్యం సేకరణపై డెప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలకు శిక్షణ ఇచ్చారు. డీఎస్‌వో మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియలో ప్రొక్యూర్‌మెంట్ మొబైల్ యాప్ ఉపయోగించాలని సూచించారు. కస్టోడియన్ అధికారులుగా వీఆర్వోలు, వాహన కదలిక పర్యవేక్షణ అధికారులుగా డెప్యూటీ తహసీల్దార్లు వ్యవహరిస్తారని, వీరు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు షిఫ్టులలో పనిచేయాల్సి ఉందన్నారు. ధాన్యం ఎంత సేకరించారు, ధాన్యం రకం, తేమశాతం, వాహనంలో ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ సమయాలు, మిల్లు పేరు తదితర వివరాలను నమోదు చేసేందుకు తప్పనిసరిగా రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. ధాన్యం సాధారణ రకం క్వింటాల్‌కు రూ. 2,300, ఏ గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ. 2,320 ప్రభుత్వం మద్దతు ధర కల్పించిందన్నారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన డీఆర్వో యత్నాలు !

చంద్రశేఖరరావు ఇక్కడే కొనసాగేలా ఉత్తర్వులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు తన బదిలీని నిలుపుదల చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. గత ఎన్నికల ముందు బదిలీపై వచ్చిన ఆయనకు ఇటీవలే స్థాన చలనం కలిగింది. ఆయన ఇక్కడే ఉండేలా వివిధ మార్గాల్లో యత్నాలు సాగించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఇక్కడ నియమించిన ఐసీడీఎస్ ఆర్‌జేడీ రోహిణి రావడానికి ఆసక్తి చూపకపోవడంతో చంద్రశేఖరరావునే తిరిగి కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారిగా కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సోమవారం జీఓ ఆర్‌టీ నంబర్ 1835 జారీ చేశారు.

ముగ్గురు ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైళ్ల నిర్వహణలో లోపాలను గుర్తించి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించిన విజయవాడ డివిజన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా 'జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డు - సెప్టెంబర్ 2024' అందుకున్నారు. సోమవారం జోనల్ హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలతో వర్చువల్ పద్ధతిలో జీఎం భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రమం తప్పకుండా అన్ని సెక్షన్లలో సేఫ్టీ డ్రైవ్‌లు నిర్వహించాలని, ప్రధానంగా రాత్రిపూట తనిఖీలు చేసి లోపాలను గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం విజయవాడ డివిజన్‌లో విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించిన పాయింట్ మెన్ సీహెచ్ బాబురావు, గూడ్స్ ట్రైన్ మేనేజర్ హీరాలాల్ మీనా, మెకానికల్ విభాగంలో టెక్నీషియన్ ఎన్.ప్రశాంత్‌కుమార్‌లకు జీఎం అవార్డులను అందజేశారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఏవీరావు

డీఎంఈ కార్యాలయానికి డాక్టర్ వెంకటేష్



డాక్టర్ డి.వెంకటేష్



డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు (ఏవీరావు)

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు(ఏవీరావు) పూర్తి అదనపు బాధ్యతలతో(ఎఫ్ఏసీ) నియమితులయ్యారు. ప్రస్తుతం అడిషనల్ డైరెక్టర్ హోదాలో సూపరింటెండెంట్‌గా చేస్తున్న డాక్టర్ వెంకటేష్‌ను డీఎంఈ కార్యాలయంలో అదనపు డీఎంఈగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఎవరినీ నియమించలేదు. ప్రిన్సిపాల్‌ను నియమించే వరకూ డాక్టర్ వెంకటేష్ అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఆయన డీఎంఈ కార్యాలయానికి వెళ్తుండటంతో పలువురు అభినందించారు. డాక్టర్ వెంకటేష్ మంగళవారం సాయంత్రంగానీ, బుధవారం గానీ రిలీవ్ అయ్యే అవకాశం ఉంది. ఆయన నుంచి డాక్టర్ ఏవీ రావు బాధ్యతలు స్వీకరించనున్నారు.

హోరాహోరీగా ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ పోటీలు



బాక్సింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు కృష్ణలంకలోని జూనియర్ కాలేజీ క్రీడా వికాస కేంద్రంలో రెండో రోజు హోరాహోరీగా జరిగాయి. 12 ఉమ్మడి జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించినట్లు ఆర్గనైజర్, ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్-19 కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నుంచి జరిగిన సెమీ ఫైనల్స్‌లో క్రీడాకారుల మధ్య పోరు రసవత్తరంగా సాగింది. బాలురు 49-52 బరువు విభాగంలో చరణ్‌రెడ్డి(గుంటూరు), మోహన్(విశాఖ), 56-60లో హరీష్(విశాఖ), సాయిసాగర్(నెల్లూరు), 66-64లో కౌశిక్(కృష్ణా), కృష్ణకుమార్(విశాఖ), 52-56లో దుర్గారావు(విజయనగరం), కిరణ్(విశాఖ), 64-69 ప్రణీష్‌రెడ్డి(విశాఖ), గోపీ(గుంటూరు), 69-75లో హేమంత్‌రెడ్డి(చిత్తూరు), అనిరుధ్(కృష్ణా), 75-81లో జశ్వంత్(నెల్లూరు), బాలకుమార్(విజయనగరం), 81-91లో హరీష్(శ్రీకాకుళం), సూర్యతేజ(విజయనగరం), బాలికల 54-57 విభాగంలో పల్లవి(విశాఖ), వైజయంతి(నెల్లూరు), 57-60లో రాణి(తూర్పుగోదావరి), సాయిలిఖిత(విశాఖ), 60-64లో కీర్తన(నెల్లూరు), అమృతమయి(గుంటూరు), 64-66లో అమూల్య(నెల్లూరు), శివాని(విశాఖ) ఫైనల్స్ చేరారు.

స్కూల్ గేమ్స్ ట్రాక్ ఓవరాల్ చాంప్ 'కృష్ణా'



సైక్లింగ్ ట్రాక్ విజేతలు

విజయవాడరూరల్: అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ సైక్లింగ్ ట్రాక్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు కైవసం చేసుకొంది. నున్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల సైక్లింగ్ (ట్రాక్) విభాగం పోటీలు సోమవారం జరిగాయి. అండర్ 14,17,19 కేటగిరిల బాలుర, బాలికల విభాగాల్లో కృష్ణాజిల్లా సైక్లిస్టులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు జిల్లా రెండో స్థానంలో, విజయనగరం జిల్లా మూడో స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో నున్న జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి, కృష్ణా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె.సుగుణరావు, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) సైక్లింగ్ కోచ్, టోర్నమెంట్ పరిశీలకుడు వి.కనకారావు తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్' జేఏసీ ధర్నా



అఖిలపక్ష నేతల ధర్నా

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ సమీపంలోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన జగ్గయ్యపేట లైమ్స్ స్టోన్స్ మైన్స్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ముందు జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ధర్నా చేశారు. కార్మిక సంఘాల నాయకులు విజయకుమార్, మన్నె శ్రీనివాసరావు, ప్రసాద్‌బాబు తదితరులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటానికి చర్యలు తీసుకుంటామని కూటమి ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో కానరావడం లేదన్నారు. ఈ నెల 8 వ తేదీన జరిగిన అఖిలపక్ష సమావేశంలో స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, లేదా ప్యాకేజీ ఇవ్వాలని నిర్ణయించిందని, 15 రోజులవుతున్నా అమలు చేయడం లేదని తెలిపారు. ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు సమయానికి జీతాలు అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సొంత గనులను కేటాయించి ప్లాంట్‌ను పూర్తిసామర్థ్యంతో నడపాలని, ఇతర అంశాలను డిమాండ్ చేశారు. రామచందర్, వల్లిబాబు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు తొలగించండి

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి కలెక్టర్ నిధిమీనాకు వినతిపత్రాలు అందజేత
- సిండికేట్లు బెదిరిస్తున్నారంటూ వివరించిన కంచికచర్ల మహిళలు



కంచికచర్లలో వైన్స్ తొలగించాలంటూ వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన మహిళలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కంచికచర్ల పంచాయతీ పరిధిలో విజయవాడ రహదారి పక్కన బంక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సాయిదుర్గా వైన్స్‌ను తొలగించాలంటూ ఆ గ్రామానికి చెందిన మహిళలు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. అక్కడి పరిస్థితులను మహిళలు ఇన్‌చార్జి కలెక్టర్‌కు వివరించారు. 'కంచికచర్ల-విజయవాడ రహదారిలో పెట్రోల్ బంక్ సెంటర్‌లో సాయి దుర్గా వైన్స్ పేరిట మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. పక్కనే సంస్కృతి స్కూల్, శ్రీచైతన్య స్కూల్, పారామెడికల్ కళాశాల, రిక్వెస్ట్ బస్టాప్ ఉన్నాయి. పాఠశాలలకు వెళ్లే దారి మొదట్లోనే మద్యం దుకాణం ఏర్పాటుచేశారు. ఆ ప్రాంతంలో 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. పదో తరగతి విద్యార్థినిలు రాత్రి తొమ్మిదింటి వరకు ట్యూషన్ నుంచి వస్తారు. ఇక్కడ షాపు పెట్టొద్దు అంటూ రిక్వెస్ట్ చేశాం. అధికారులు, స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశాం. ధర్నా కూడా చేశాం.. ఎవరూ పట్టించుకోలేదు'. 'స్కూల్స్‌కు 100 మీటర్ల అవతలే షాపు ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారమే షాపు ఉంది' పైగా ప్రభుత్వానికి ఫీజు చెల్లిస్తున్నారంటూ ఎక్సైజ్ సీఐ సమర్థిస్తున్నారని మహిళలు వివరించారు. మద్యం దుకాణం వద్ద ధర్నా చేస్తే కేసులు పెడతామంటూ పోలీసులు బెదిరిస్తున్నారని వాపోయారు. ఎమ్మెల్యేను కలిస్తే మా ముందు హడావిడి చేశారు. తర్వాత ఎటువంటి చర్యలు లేవు. 'ఇక సిండికేట్లు ఎవరు అడ్డువస్తారో చూస్తామంటూ బెదిరిస్తున్నారని' మహిళలు తెలిపారు. ఇక్కడ ఎమ్మెల్యే మహిళ, ఎక్సైజ్ సీఐ మహిళ, తహసీల్దార్, ఎంఈవో అధికారులంతా మహిళలే .. అయినా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ షాపు తొలగించాల్సిందేనంటూ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

చేపల మార్కెట్ వద్ద షాపు తొలగించాలి: సీపీఐ

పటమట లంక చేపల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం కారణంగా 9,14 డివిజన్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే షాపు తొలగించాలంటూ సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు స్థానికులతో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

పీజీఆర్ఎస్‌కు 157 దరఖాస్తులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 157 అర్జీలు వచ్చాయి. సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ నిధిమీనా తెలిపారు. పీజీఆర్ఎస్‌లో డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్.. కేసు నమోదు

పెనమలూరు: తాడిగడపలో బాలిక అదృశ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. తాడిగడప రైస్ మిల్లు సమీపంలో 15 ఏళ్ల బాలిక తల్లిదండ్రులతో నివసిస్తోంది. ఆ బాలికకు ఇన్‌స్టాగ్రామ్‌లో పల్నాడు జిల్లా గురజాలకు చెందిన కన్నేగంటి సంపత్‌కుమార్‌తో పరిచయమైంది. తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌నని, వివాహం చేసుకుంటానని బాలికను సంపత్‌కుమార్ నమ్మించాడు. ఈ నెల 25న బాలిక సోదరుడితో కలిసి బయటకు రాగా సంపత్‌కుమార్ కారులో వచ్చి ఆమెను తీసుకు వెళ్లిపోయాడు. విషయాన్ని బాలిక సోదరుడు తల్లిదండ్రులకు తెలిపాడు. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కిడ్నాప్ కేసు నమోదు చేశారు.

బైక్ చోరీలకు పాల్పడుతున్న ముఠాల ఆటకట్టు

- ఐదుగురి అరెస్ట్.. 40 ద్విచక్ర వాహనాల స్వాధీనం
- కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు


జిల్లా పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: జిల్లాలో బైక్ చోరీలకు పాల్పడుతున్న ముఠాల ఆటకట్టించారు జిల్లా పోలీసులు. బందరు సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అనేక నేరాలకు పాల్పడిన చోరులను పట్టుకున్న పోలీసులు వారి నుంచి 40 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు సోమవారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మచిలీపట్నం జవ్వారుపేటకు చెందిన ఫరాన్, ఇనగుదురుపేటకు చెందిన కైఫ్ పాషా, మహమ్మద్ ఫరీద్‌లు స్నేహితులు. ఫరీద్ ఐటీఐ చదువుతున్నాడు. కైఫ్ పదో తరగతి వరకు చదువుకుని ఆపేశాడు. వ్యసనాలకు బానిసలైన వీరు విలాసవంతమైన జీవితాన్ని గడిపేందుకు పూనుకున్నారు. అందుకోసం బైక్ చోరీలు చేయటం మొదలుపెట్టారు. అలా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో బైక్‌లను చోరీ చేశారు. వీరి చేసిన చోరీలపై బందరు, పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి, చల్లపల్లి, ఉయ్యూరులతో పాటు ఇతర ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్‌ల్లోనూ కేసులు నమోదయ్యాయి. వీరు ఏడాదిగా బైక్ చోరీలకు పాల్పడుతున్నారు. బందరు రూరల్ ఎస్‌ఐ కె.నాగరాజు సోమవారం ఉదయం రుద్రవరం బస్‌షెల్టర్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు బైక్‌లపై వెళ్తూ అనుమానాస్పద స్థితిలో తారసపడ్డారు. అప్రమత్తమైన ఎస్‌ఐ నాగరాజు ముగ్గురిని వెంబడించి అడ్డుకున్నారు. వారిని విచారించగా బైక్‌లను దొంగతనం చేసి తీసుకువెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. వీరి నుంచి రూ.41 లక్షలు ఖరీదు చేసే 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

పెడనలో 15 బైక్‌ల స్వాధీనం..

పెడన పోలీసులు మరో 15 బైక్‌లను రికవరీ చేశారని జిల్లా ఎస్పీ గంగాధరరావు తెలిపారు. పెడన మండలం నందమూరు గ్రామ శివారు జయంతి కాలనీకి చెందిన నామన శ్రీనివాసరావు, భీమవరం జిల్లా మొగల్తూరు ఇందిరాకాలనీకి చెందిన మోక దుర్గారావు కలిసి జిల్లాతో పాటు వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో బైక్ చోరీలకు పాల్పడి 15 వాహనాలు అపహరించారన్నారు. బైక్ చోరీలపై ఫిర్యాదులు అందుకున్న ఆయా స్టేషన్ల అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం బందరు రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్, పెడన సీఐ సత్యనారాయణతో కలిసి నందమూరు శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నామన శ్రీనివాసరావు తన ఇంటి వద్ద దాచి పెట్టి ఉంచిన రూ.6.40 లక్షల విలువ చేసే 15 బైక్‌లను రికవరీ చేశామన్నారు.

ఎస్పీ అభినందనలు

జిల్లాలో జరుగుతున్న బైక్ చోరీలను దృష్టిలో పెట్టుకుని వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. బైక్ దొంగలను పట్టుకోవటంలో కృషి చేసిన బందరు తాలూకా ఎస్‌ఐ నాగరాజుతో పాటు బందరు రూరల్, పెడన స్టేషన్ల సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, నగదు ప్రోత్సాహకాలను అందించారు. విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్, ఆర్‌పేట, బందరు తాలూకా సీఐలు ఏసుబాబు, నాగేంద్రప్రసాద్, ఎస్‌ఐలు కె.నాగరాజు, సత్యనారాయణ, ఆయా స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్ పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ సొమ్ము హాంఫట్

- పీఎఫ్ సొమ్ము కాజేసిన కాంట్రాక్టర్
- రేపు విజయవాడలో విచారణ


పీఎఫ్ సొమ్ము జమ చేయాలంటూ నిరసన తెలుపుతున్న కార్మికులు(ఫైల్)

మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్ శఠగోపం పెడుతున్నాడు. వారి జీతాల నుంచి ప్రతి నెల మినహాయిస్తున్న లక్షలాది రూపాయలను పీఎఫ్ ఖాతాలో జమ చేయకుండా తాత్సారం చేస్తుండటంతో రెక్కలు ముక్కలు చేసుకుని పని చేస్తున్న కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోంది. ఆస్పత్రిలో దాదాపు 106 మంది, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 19 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. వీరికి వచ్చే జీతాల నుంచి పీఎఫ్ జమ కోసం ప్రతి నెల దాదాపు రూ.4 వేలు కాంట్రాక్టర్ మినహాయించి జీతాలు వేస్తున్నాడు. కానీ గత 40 నెలలుగా మినహాయిస్తున్న పీఎఫ్ సొమ్ము దాదాపు రూ.1.69 కోట్లు మేర ఆ ఖాతాలో జమ చేయాల్సి ఉండగా ఇది జరగటం లేదు. దీంతో కార్మికులు నష్టపోతున్నారు. ఇటీవల అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ అనే ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చి నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సమయంలో పీఎఫ్ సొమ్మును అక్టోబర్ 4వ తేదీలోగా జమ చేస్తానంటూ హామీ ఇచ్చిన కాంట్రాక్టర్ ఇప్పటి వరకు ఆ దిశగా ప్రయత్నం చేయకపోవటంతో కార్మికుల్లో ఆందోళన మరింత ఎక్కువవుతోంది. సంఘం ఆధ్వర్యంలో పీఎఫ్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఈఎస్‌ఐ ఆర్డీ వేణుగోపాల్‌ను కలిసి కార్మికులు తమ గోడును వెల్లడించినా ఫలితం లేకపోయింది. గత నెల 23వ తేదీన రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర లేబర్ కమిషనర్, డెప్యూటీ లేబర్ కమిషనర్ తదితర అధికారులను కలిసి రెండోసారి సమ్మె నోటీసులు ఇచ్చారు.

సూపరింటెండెంట్ల అంతర్యంపై ఆశ్చర్యం..

ఏపీవీవీపీ నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి జిల్లా ఆస్పత్రి అప్‌గ్రేడ్ జరిగి 22 నెలలు కావస్తోంది. ఏపీవీవీపీ పరిధిలో ఉన్న నాటి నుంచి కూడా ఇదే కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నాడు. నాడు ప్రతి నెల కాంట్రాక్టర్‌కు జీతాలు చెల్లించేందుకు రూ.18.50 లక్షలు చెల్లింపులు జరిగేవి. సర్వజన ఆస్పత్రిగా రూపాంతరం చెందిన తరువాత కార్మికులు పెరగక పోయినా ఈ మొత్తం రూ.21.78 లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్నారు. అయినా పారిశుద్ధ్య నిర్వహణలో నాణ్యత పెరగకపోవటం గమనార్హం. ప్రతి నెల జీతాలు మంజూరయ్యేందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్లు కాంట్రాక్టర్ పర్ఫార్మెన్స్‌ను తెలియజేయాల్సి ఉంది. నాటి నుంచి ఉన్న సూపరింటెండెంట్లు ప్రతి నెల సదరు కాంట్రాక్టర్ 97 శాతం పర్ఫార్మెన్స్ చూపుతున్నట్లు నివేదిక ఇస్తున్నారు. దీంతో జీతాల బిల్లు సజావుగా మంజూరవుతున్నాయి. కార్మికుల ఖాతాలో జమ చేయాల్సిన పీఎఫ్ సొమ్ము లక్షల్లో కట్ చేస్తున్నప్పటికీ జమ చేయకుండా కాంట్రాక్టర్ తాత్సారం చేసినా పర్ఫార్మెన్స్ ఎక్కువగా చూపటంలో ఆంతర్యం ఏమిటోనని కార్మికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

రేపు విజయవాడలో విచారణ

మినహాయించిన పీఎఫ్ సొమ్ము కార్మికుల ఖాతాల్లో జమ చేయకపోవటంపై అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కార్మిక సంఘం ఇచ్చిన నోటీసుపై ఈ నెల 30వ తేదీ బుధవారం విజయవాడలోని కార్మికశాఖ డెప్యూటీ కమిషనర్ కార్యాలయంలో విచారణ నిర్వహించనున్నట్లు తెలిసింది.

కబడ్డీ పోటీలకు కృష్ణా యూనివర్సిటీ టీమ్ పయనం


కృష్ణా యూనివర్సిటీ కబడ్డీ టీమ్‌తో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల మూడో తేదీ వరకు జరగబోయే కబడ్డీ పోటీలకు యూనివర్సిటీ కబడ్డీ టీమ్ సోమవారం పయనమైంది. ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి కబడ్డీ టీమ్ సభ్యులను అభినందించారు. చెన్నైలో విజయకేతనం ఎగురవేసి రాష్ట్రం, జిల్లా పేరు ప్రఖ్యాతులు నిలపాలని ఆమె సూచించారు. కృష్ణా యూనివర్సిటీ టీమ్‌లో ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి కె.వెంకట ఫణీంద్ర, వై.శామ్యూల్ రాజ్, పి.క్రాంతి, వర శివరామకృష్ణ, నలంద డిగ్రీ కళాశాల నుంచి భగత్, జి.ఎస్.జ్యోతి కల్యాణ్, పి.గౌరీ నాయుడు, పి.బి.సిద్ధార్థ కళాశాల నుంచి కె.మహేష్, ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కాలేజీ నుంచి ఎం.అఖిల్, డీఏఆర్ కాలేజీ నూజివీడు నుంచి కె.అజయ్, వికాస్ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నున్న నుంచి సీహెచ్ సాయి తేజ, పీవీ సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ విజయవాడ నుంచి కె.మహేష్, కేబీఎన్ కాలేజీ విజయవాడ నుంచి ఎం.గాంధీ, బి.సునీల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారని ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల వ్యాయామ విద్యా విభాగాధిపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ డి.యుగంధర్ ఈ టీమ్‌కు మేనేజర్‌గా వ్యవహరిస్తారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ అధ్యాపకుడు డి.నవీన్ కుమార్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

గుడివాడరూరల్: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.6 వేల జరిమానా విధిస్తూ గుడివాడ 11వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.సుబ్రహ్మణ్యం తీర్పు ఇచ్చారని గుడివాడ తాలూకా పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కల్వపూడి అగ్రహారం గ్రామానికి చెందిన వరిగంజి జాన్‌బాబు తన తల్లి హత్య కేసులో జైలు శిక్ష అనుభవించే క్రమంలో బెయిల్ కోసం వరుసకు బాబాయి అయిన వరిగంజి అర్జున్‌రావును ష్యూరిటీ ఇవ్వాలని కోరాడు. అర్జున్‌రావు అందుకు అంగీకరించలేదు. దీంతో ఆగ్రహించిన జాన్‌బాబు జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత అర్జునరావును హత్యచేయాలని నిర్ణయించాడు. 2016 సెప్టెంబర్ 8వ తేదీన అర్జునరావు, అతని భార్య కుమారి, కుమారుడు నాగరాజుపై ఇనుపరాడ్లతో దాడి చేశాడు. ఈ దాడిలో అర్జునరావు మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గుడివాడ తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ఎస్.శివాజీరావు విచారణ చేపట్టి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ రహమతుల్లా షరీఫ్ వాదనలు వినిపించారు. 21 మంది సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో నిందితుడు జాన్‌బాబుకు జీవిత ఖైదు, రూ.6 వేల జరిమానా విధిస్తూ జడ్జి సోమవారం తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్షపడేలా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాజిక్యూటర్ షేక్ రహమతుల్లా షరీఫ్, సాక్ష్యాలు పొందుపర్చడంలో ప్రతిభ కనబర్చిన అప్పటి సీఐ శివాజీరావు, ప్రస్తుత సీఐ ఎస్.ఎల్.ఆర్.సోమేశ్వరరావు, ఎస్‌ఐ ఎన్.చంటిబాబు, కోర్టు మానిటరింగ్ హెడ్ కానిస్టేబుల్ కె.వి.వి.మోహనరావును ఎస్పీ ఆర్.గంగాధరరావు ప్రత్యేకంగా అభినందించారని తాలూకా పోలీసులు తెలిపారు.



కంచికచర్లలో గ్రావెల్ తరలిస్తున్న లారీల పట్టివేత


కంచికచర్లలో పట్టుబడిన లారీలు

కంచికచర్ల: ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్న రెండు లారీలను రెవెన్యూ అధికారులు సోమవారం పట్టుకున్నారు. లారీలను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి, మైనింగ్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత..

ఇసుకను అక్రమంగా తరలించినా, నిల్వ ఉంచినా కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని ఎస్‌ఐ బోనగిరి రాజు హెచ్చరించారు. కంచికచర్ల మండలం మోగులూరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని ఎస్‌ఐ సోమవారం పట్టుకున్నారు. లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా మండలంలోని గండేపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పను సీజ్ చేశామన్నారు. ఇసుక నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పోలీస్ ప్రజావాణిలో 117 ఫిర్యాదులు


ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి

విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(ప్రజావాణి)లో 117 మంది ఫిర్యాదులు అందజేశారు. నగదు లావాదేవీలపై 35, కుటుంబ కలహాలపై 18, భూ వివాదాలపై 10, మోసాలపై 15, వేధింపులపై 12, దొంగతనాలపై ముగ్గురు, సైబర్ నేరాలపై ఒక్కరు, చిన్నచిన్న వివాదాలపై 12 ఫిర్యాదులు అందాయి. కేసుల త్వరితగతిన పరిష్కారం కోరుతూ ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదులను డీసీపీలు గౌతమి సాలి, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన అనంతరం ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆయా స్టేషన్ల అధికారులను డీసీపీలు ఆదేశించారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి


శిరీష మృతదేహం

కోనేరుసెంటర్: కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నబీ తెలిపిన వివరాల ప్రకారం మచిలీపట్నం పెయింటర్స్ కాలనీకి చెందిన పేరం మల్లేశ్వరరావు, శిరీషలకు 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. ఎలక్ట్రీషియన్ పనులు చేసుకునే మల్లేశ్వరరావుకు శిరీషకు మధ్య తరచు గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో ఆదివారం వారి మధ్య గొడవ జరిగింది. దీంతో శిరీష పై అంతస్తులోకి వెళ్లి అనుమానాస్పదస్థితిలో ఆత్మహత్య చేసుకుంది. పై అంతస్తుకు వెళ్లిన శిరీష ఎంతకీ కిందికి రాకపోవటంతో మల్లేశ్వరరావు పైకి వెళ్లి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది.

కేసు నమోదు

దీంతో మల్లేశ్వరరావు భార్య పుట్టింటి వారికి ఫోన్ చేసి శిరీష ఆత్మహత్య చేసుకుందని చెప్పాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన బందరు చేరుకున్నారు. తన కుమార్తెను భర్తే చంపాడంటూ మృతురాలి బంధువులు ఆరోపిస్తూ విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనపై మృతురాలి బంధువుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు సీఐ నబీ తెలిపారు. దర్యాప్తు అనంతరం అవసరం మేరకు సెక్షన్లు మార్చి కేసు దర్యాప్తు కొనసాగిస్తామని చెప్పారు.

స్విమ్మింగ్ పోటీల్లో 19 పతకాలు

జగ్గయ్యపేటఅర్బన్: గుంటూరులోని మున్సిపల్ స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ వారు ఈ నెల 27న నిర్వహించిన 5వ స్టేట్ చాంపియన్‌షిప్ స్విమ్మింగ్ పోటీల్లో జగ్గయ్యపేట డ్రీమర్స్, స్విమ్మర్స్ సత్తా చాటారు. అసోసియేషన్ నుంచి స్విమ్మర్లు 8 మంది పురుషులతో కూడిన జట్టు పాల్గొనగా, వారిలో ఏడుగురు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి విజయదుందుభి మోగించారు. కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మి సారథ్యంలో ఈ పోటీల్లో పాల్గొన్న స్విమ్మర్లు మొత్తం 19 పతకాలు సాధించారు. వాటిలో 6 స్వర్ణం, 5 రజిత, 8 కాంస్యం పతకాలు సాధించినట్లు టీమ్ మేనేజర్ అన్నంనీడి కల్యాణ్ సోమవారం విజేతల వివరాలను తెలిపారు.

విజేతలకు అభినందనలు

గంజి మోహన్‌బాబు స్వర్ణం – 4, అడ్డగొట్టం రమేష్‌బాబు స్వర్ణం-2, రజతం-2, పొట్టాబత్తిన సందీప్(కోచ్) కాంస్యం-2, విస్లావత్ రామచంద్రనాయక్ కాంస్యం-1, కొండూరు యలమందరావు రజతం-1, కాంస్యం-2, గోపనబోయిన శ్రీనివాసరావు రజతం-2, కాంస్యం-2, యంగ్రాతి రామారావు కాంస్యం-1 సాధించారు. విజేతలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కృష్ణా స్విమ్మర్స్, డ్రీమర్స్ స్విమ్మింగ్ యూనియన్ నాయకులు అభినందించారు.

విద్యార్థి చేయి విరిగినా పట్టించుకోరా ?

వీరులపాడు: పాఠశాలలో విద్యార్థుల మధ్య జరిగిన ఘటనలో తమ కుమారుని చేయి విరిగినా ఉపాధ్యాయులు కనీసం పట్టించుకోలేదని విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే మండలంలోని జమ్మవరం గ్రామానికి చెందిన మంగళపూడి కరుణాకర్‌రావు కుమారుడు సృజన్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 24న విద్యార్థుల మధ్య జరిగిన ఘటనలో సృజన్ ఎడమ చేయి విరగటంతో విద్యార్థి చేయి నొప్పిగా ఉందని చెప్పినా ఉపాధ్యాయులు కనీసం పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం సమయంలో వ్యవసాయ పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన తరువాత తోటి విద్యార్థులు సృజన్‌కు గాయాలయ్యాయని పాఠశాలలోనే ఉన్నాడని చెప్పటంతో పాఠశాలకు వెళ్లి చూడగా చేయి ఊగుతూ కనిపించిందని చెప్పారు. తమ కుమారుడిని విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చేయి విరిగిందని వైద్యులు చెప్పారని ఏం జరిగిందని ఉపాధ్యాయులను ప్రశ్నించగా తమకేమీ తెలియదని చెబుతున్నారన్నారు. ఉపాధ్యాయుల తీరు సరిగా లేదని విద్యార్థికి గాయాలైనా పట్టించుకోకపోగా కనీసం తల్లిదండ్రులకు కూడా సమాచారం అందించలేదని మరేదైనా ప్రమాదం జరిగినా ఇదే విధంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు

ఈ విషయమై ఎంఈఓ పాల్ కెనడీని వివరణ కోరగా విద్యార్థుల మధ్యన జరిగిన ఘటనలో సృజన్‌కు గాయమైందని, వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిని పిలిపించి చికిత్స చేయించామని ఉపాధ్యాయులు చెప్పారన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉమ్మడి కృష్ణా పవర్ లిఫ్టింగ్ పోటీలకు జట్ల ఎంపిక


పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

జగ్గయ్యపేటఅర్బన్: 68వ ఉమ్మడి కృష్ణా జిల్లాల అండర్ – 17 బాలబాలికల పవర్ లిఫ్టింగ్ ఎంపికలు సోమవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎంపికల నియోజకవర్గ ఆర్గనైజర్ గంటా వెంకటేశ్వర్లు, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బాలురు జట్టు వి.గణేష్ హర్షవర్ధన్, నాగార్జున కాలేజీ, తిరువూరు, బి.మూల్యతేజ, జెడ్పీ హైస్కూల్, చిల్లకల్లు, కె.చరణ్ రిత్విక్, గౌతమ్ కాన్సెప్ట్ కాలేజీ, గుడివాడ, సీహెచ్.మణికంఠ, జెడ్పీ హైస్కూల్, కేసరపల్లి, ఎస్.మణిపాల్, జెడ్పీ హైస్కూల్, కేసరపల్లి, పి.అభినవ, శ్రీచైతన్య జూనియర్ కాలేజీ, విజయవాడ, డి.యశోధర, నిర్మలా హైస్కూల్, మచిలీపట్నం, జి.అజయ్‌వర్మ(ఎగ్స్ట్రా ప్లేయర్), నిర్మలా హైస్కూల్, మచిలీపట్నం. బాలికల జట్టు వి.సువర్ణ నాగదుర్గ, నాగార్జున కాలేజీ, తిరువూరు, కె.అఖిల, జెడ్పీ హైస్కూల్, దావోజిగూడెం, పి.హిమసంజన, శ్రీచైతన్య, మైలవరం, సీహెచ్.రిష్విత, దావోజిగూడెం, ఎస్.ప్రహర్షిణి, ఎస్‌ఎస్‌ఆర్‌వీ మందిర్, కేఎస్‌ఆర్ నగర్, రామ్‌కో సిమెంట్స్, జగ్గయ్యపేట, పి.శ్రావణలక్ష్మి, జెడ్పీ హైస్కూల్, కేసరపల్లి, ఎండీ.నూర్జాన్, జెడ్పీ హైస్కూల్, పామర్రు, ఎం.హర్షిత, జెడ్పీ హైస్కూల్, దావోజిగూడెం, ఎగ్స్ట్రా ప్లేయర్లు ఎం.శరణ్య, జెడ్పీ హైస్కూల్, కేసరపల్లి, టి.రిష్మిత, జెడ్పీ హైస్కూల్, దావోజిగూడెం. ఎంపికైన వారు నవంబర్ 2, 3, 4 తేదీల్లో తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.